క్లుప్తంగా

రేపు మండల సమావేశం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తుంగల స్వర్ణలత తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక పాల్గొనాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ముదినేపల్లి రూరల్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వైద్య వ్యయపరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి సంబంధించి నూతన ఆరోగ్యశ్రీ కార్డులను మండలంలోని అల్లూరు కొరగుంటపాలెంలో గురజ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శనివారం పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ అబ్దుల్‌రహీం మాట్లాడుతూ అల్లూరులో 614, కొరగుంటపాలెంలో 803 కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డులు అందేలా వైద్యశాఖ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మాదిగలంతా ఐక్యంగా ఉండాలి

ముదినేపల్లి రూరల్: రాష్ట్రంలోని మాదిగలంతా ఐక్యంగా ఉంటూ హక్కుల కోసం పోరాడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య అన్నారు. ముదినేపల్లిలో మాదిగల మేలుకొల్పు నియోజకవర్గ మహాసభ శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీరయ్య మాట్లాడుతూ రాజకీయ రంగంలో మాదిగలకు కొన్ని పార్టీలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. మాదిగలకు అన్నిరకాలుగా అండగా ఉండే పార్టీలకే మద్దతు పలకాలన్నారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఏసుపోగు దానియేలు, నాయకులు బీడీ ఇజ్రాయేలు, కంచర్ల సుధాకర్, జోషి పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మతల్లి పుట్టినరోజు వేడుకలు

పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులో ఉన్న శ్రీ కరుమారి అమ్మన్(అంకమ్మతల్లి) ఆలయంలో అమ్మవారి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని అమ్మవారికి విశేషంగా ఆవు పాలతో పంచామృతాలతో నవరసాలతో అభిషేకాలను చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని నవ గ్రహ మండపారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వరదా అప్పారావు దంపతులతో చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో వీ అప్పారావు, ఉమామహేశ్వరరావు, పేరయ్య, దుర్గా ప్రసాద్, చెన్నారాయుడు పాల్గొన్నారు.

కోర్సుల ఎంపికే కీలకం



మండవల్లి: క్రమశిక్షణ, వ్యక్తిత్వం, నడవడిక విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని ప్రొఫెసర్ సూదాబత్తుల విజయ్‌కుమార్ అన్నారు. ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, టి అప్పారావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం పీవీఎస్ఎస్ జి.ప్రసాద్ అధ్యక్షతన 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ భిన్నమైన ఆలోచనా సరళి ద్వారా, అభిరుచికి నచ్చిన సబ్జెక్టుల ఎంపిక, కోర్సులు తీసుకునే నిర్ణయమే కీలకమన్నారు. ఇదే భవిష్యత్‌ను నిర్దేశిస్తుందని, ఆలోచించి అడుగులు వేయాలన్నారు. జీవితంలో క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. పట్టుదలతో విద్యార్థులు చదివి తల్లిదండ్రుల లక్ష్యం నెరవేర్చాలని భాస్కరరావు, హెచ్ఎం ప్రసాద్, అప్పారావు కోరారు.

‘నవరత్నాల’తో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



మంత్రి పాలెంలో రహదారులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు(మొవ్వ): నవరత్న పథకాల అమలుతో అన్ని వర్గాల ప్రజలకు పూర్తి స్థాయిలో లబ్ధి చేకూరుతోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార అన్నారు. మొవ్వ మండలం మంత్రి పాలెం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. గ్రామంలో రూ.1.10 కోట్లతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, వెల్ నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం సుమారు రూ.25లక్షలతో నిర్మించిన పలు రహదార్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేద వాడు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందన్నారు. పేదలను సంపన్నులుగా మార్చాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు.

దేశానికే ఆదర్శం సచివాలయ వ్యవస్థ

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక అయిన సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శప్రాయంగా నిలుస్తోందని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. పక్క రాష్ట్రాల వారు సచివాలయ వ్యవస్థను అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు విత్తనాల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు వరకు అన్ని రకాల సేవలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండాలనే ఉద్దేశ్యంతో వెల్ నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి మెరుగైన ఆరోగ్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. కుల,మత, పార్టీ అని విబేధాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలనే లక్ష్యంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఇంతటి సంక్షేమ పాలన అందిస్తున్న ప్రభుత్వాన్ని మనమందరం మళ్లీ ఆదరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు ప్రతిఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంది కృష్ణ, ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీలక్ష్మీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, మండల సచివాలయ కన్వీనర్ సమ్మెట ఆంజనేయులు, మొవ్వ మండల బీసీ నాయకుడు రమణ, అయ్యంకి సర్పంచ్ సునీల్, రాజులపాటి మురళి పాల్గొన్నారు.



మంత్రి పాలెంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

ప్రాథమిక పాఠశాలకు వందేళ్లు పూర్తి

ఘనంగా వేడుకలు

పెరిశేపల్లి(పామర్రు): మండలంలోని పెరిశేపల్లి గ్రామ శివారుప్రాంతమైన సపదర్‌ఖాన్ పాలెంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.

ఈ పాఠశాలను 1923లో ప్రారంభించారు. దీంతో స్థానిక ప్రజలు, విద్యార్థులు ఉపాధ్యాయులు అందరూ కలిసి ఉత్సాహంగా పలు కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 28 మంది విద్యార్థులకు పలు ఆటల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా పామర్రు ఎంఈఓ-1 బీఎస్‌సీ సింగ్, ఎంఈఓ-2 పద్మవాణి పాల్గొని మాట్లాడారు. వందేళ్ల పాటు పాఠశాల నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ వందేళ్లలో ఎంతో మందికి విద్యాదానం చేసి సమాజాభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఇదే పాఠశాలలో చదివిన విద్యార్థులు విదేశాలలో ఉద్యోగాలు పొందటం అభినందనీయమన్నారు.



విచిత్ర వేషధారణ వేసిన చిన్నారులతో ముఖ్య అతిథులు, స్థానికులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పరిశేపల్లి గ్రామ సర్పంచ్ చెరుకూరి వెంకట పద్మావతి, మాజీ ఎంపీపీ జీ లక్ష్మీదాసు, స్థానిక పెద్దలు జీ వెంకటేశ్వరరావు, చెరుకూరి రమణ, గిరిబాబు, ఎండీ ఇద్రీస్(రఫీ), పాఠశాల హెచ్ఎం అబ్దుల్ ఖయ్యూమ్, ఉపాధ్యాయులు ఎండీ అబ్బాస్, కిరణ్ పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటుకు చర్యలు

ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

పమిడిముక్కల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ కొండేటి వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జలజీవన్ మిషన్‌పై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు సురక్షితమైన, నిరంతర తాగునీటిని అందించేందుకు గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం రాష్ట్రంలో నోడల్ ఏజెన్సీగా ఉంటుందని పేర్కొన్నారు. కమ్యూనిటీ కాంట్రాక్ట్ విధానంలో గ్రామ జల సంఘం కమిటీ గ్రామంలో జేజేఎం పనుల అమలును చేపట్టాలన్నారు. గ్రామ సంఘ కమిటీలో తొమ్మిది మంది సభ్యులుగా ఉంటారని, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మెంబర్ కన్వీనర్‌గా, పంచాయితీ కార్యదర్శి ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఉంటారని తెలిపారు. జేజేఎం మార్గదర్శకాల ప్రకారం నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజు పాల్గొన్నారు.

‘మానవత’ సేవా కార్యక్రమాలు అభినందనీయం

కలిదిండి: మానవత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి సచివాలయంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు దుప్పట్లు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవత సేవా సంస్థ అధ్యక్షుడు గోదావరి సత్యనారాయణ రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచ్‌లు మసీముక్కు మారుతి ప్రసన్న, సాన మీనా సరస్వతి, వైస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మీ, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

తాగునీటి సరఫరాకు ఎమ్మెల్యే కొడాలి సహకారం



గుడ్లవల్లేరు: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సహకారంతో డోకిపర్రులో ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు ఆ గ్రామ కార్యదర్శి ఎస్.రమేష్ శనివారం తెలిపారు. తాగునీటి చెరువుకు నీటిని పెట్టే భాగంలో రెండు రోజులుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. తాగునీటి చెరువుకు నీటిని పెట్టే కాల్వలో కూడా పూడిక తీయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

పామర్రు: మండలంలో నిర్వహిస్తున్న ఈ-క్రాప్ నమోదును ఏఓ నాగరాణి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 18వేల ఎకరాల్లో మినుము సాగు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 9,500 ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన పంట నమోదును కూడా త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. వీఏఏలకు రైతులు సహకరించాలని కోరారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

తోట్లవల్లూరు: మద్యం బాటిళ్ల అక్రమరవాణకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తోట్లవల్లూరు ఎస్ఐ పి. విశ్వనాథ్ తెలిపారు. పమిడిముక్కల మండలం రెడ్డిపాలెంకు చెందిన ఏ. కృష్ణ, ఎస్.రామును మండలంలోని యాకమూరు వద్ద శనివారం అదుపులోకి తీసుకుని 12 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు

గుడివాడ టౌన్: పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు అఖిల భారత మహిళా సమాఖ్య ఢిల్లీ ఆధ్వర్యంలో మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేసినట్లు సమాఖ్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలు దండమూడి జయలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక మహిళా సంఘం కార్యాలయంలో విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించి ఏడాదికి రూ.లక్ష ఆదాయం కల్గిన పేద విద్యార్థులు ఇందుకు అర్హులన్నారు. పలు పాఠశాలలకు చెందిన పేద విద్యార్థుల దరఖాస్తులను ఢిల్లీ కార్యాలయానికి పంపగా సమాఖ్య నిబంధనలు అనుసరించి స్కాలర్‌షిప్‌ల లబ్ధిదారులను ఎంపిక చేస్తుందన్నారు. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన జె.రామవాణి రూ. 25 వేలు, అస్మాబేగం రూ. 25 వేలు, మలిరెడ్డి సుకీర్తి రూ. 25 వేలు, బోయపాటి అన్విత రూ.15 వేలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళా సంఘం వైస్ ప్రెసిడెంట్ సంధ్య, సభ్యురాలు జి.ప్రమీల, హెచ్ఎం పద్మావతి పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మహిళా సంఘం సభ్యులు

సేవలందిస్తున్న పోలీసులు అభినందనీయులు



గుడివాడ తాలూకా సీఐ ఏసుబాబు, ఎస్ఐ మూర్తిని సత్కరిస్తున్న పట్టణ ప్రముఖులు



వన్‌టౌన్ సీఐ ఇంద్రశ్రీనివాస్‌ను సత్కరిస్తున్న హరికుమార్‌యాదవ్

గుడివాడరూరల్: ప్రజలకు సేవలందిస్తున్న పోలీసులు అభినందనీయులని శ్రీకృష్ణయాదవ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ నుంచి అవార్డులు అందుకున్న గుడివాడ వన్‌టౌన్, తాలూకా సీఐలు కె.ఇంద్రశ్రీనివాస్, పి.ఏసుబాబు, వన్, తాలూకా ఎస్ఐలు గౌతమ్‌కుమార్, ఎల్ఎస్ఎన్ మూర్తిని శ్రీకృష్ణయాదవ సంఘం, మిత్రమండలి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరికుమార్‌యాదవ్ మాట్లాడుతూ సమాజంలో పోలీసుల పాత్ర చాలా కీలకమన్నారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తమ డిపార్టుమెంట్ ఎప్పుడూ ముందువరుసలో ఉంటుందన్నారు. తమను సన్మానించిన యాదవసంఘ నాయకులు, మిత్రమండలి సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నందివాడ ఎస్ఐ శిరీష, పోలీస్ అధికారులు, వైశ్యసంఘ ప్రముఖుడు బొగ్గరపు తిరుపతయ్య, నవభారత్ ఖాదీస్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, యాదవ సంఘ మహిళా రాష్ట్ర కార్యదర్శి కుంభం నాగమణి, యాదవసంఘ నాయకులు తలకొండ సత్యనారాయణ, జాజుల తాతారావు, మాకుల సత్యం పాల్గొన్నారు.

కర్పూరి ఠాకూర్‌కు ఘన నివాళి

గుడివాడ టౌన్: బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వడం హర్షణీయం అని గుడివాడ నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు దారం నరసింహారావు అన్నారు. శనివారం స్థానిక బీసీ కార్యాలయంలో కర్పూరి ఠాగూర్‌కు భారతరత్న ప్రకటించడాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీలను గుర్తించి అత్యుత్తమ సేవ చేసిన వారికి అందిస్తున్న ఈ పురస్కారానికి ఠాగూర్ ఎంపిక కావడం హర్షణీయన్నారు. ఆయన పేరు ప్రతిపాదించిన కేంద్ర ప్రభుత్వానికి బీసీ సంఘాల తరుపున కృతజ్ఞతలు తెలుపు తున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరరావు, తుమ్మా రమేష్, నాయకులు సీహెచ్ సత్యనారాయణ, డి.కృష్ణ, వై.గోవర్ధన్, రమణకుమార్, ఎన్.శేషుబాబు, ఎల్.రాధాకృష్ణ, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఠాకూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

గ్రామాభివృద్ధి కోసమే సమావేశాలు

కలిదిండి: గ్రామాభివృద్ధి కోసమే గ్రామసభ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌పీ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని మూలలంక గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మహాదేవ విజయబాబు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ రాజశేఖర్ పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్‌రెడ్డి

గుడివాడ టౌన్: గుడివాడ పురపాలక సంఘ కమిషనర్ వి.మురళీకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు శుక్రవారం బదిలీ అయ్యారు. మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ రెవెన్యూశాఖకు బదిలీకాగా ఆయన స్థానంలో రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న టీవీ రంగారావు ముమ్మిడివరం పురపాలక సంఘానికి కమిషనర్‌గా బదిలీ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా రాజాం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న డీటీవీ కృష్ణారావు అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులయ్యారు.



శ్రీకాంత్‌రెడ్డి, కమిషనర్ | కృష్ణారావు, అసిస్టెంట్ కమిషనర్

‘ఆడుదాం ఆంధ్రా’లో సత్తా చాటిన మండవల్లి ఖోఖో టీం

కలిదిండి: నియోజవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో ఖోఖో ఆటలో బొమ్మనంపాడు టీం మీద మండవల్లి టీం 2-14 స్కోరుతో గెలిచి తమ సత్తా చాటింది. శనివారం ఆరుతెగలపాడు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా ఖోఖో పోటీలను నిర్వహించారు. మండవల్లి ఖోఖో టీంను కోచ్ జె.శ్రీనివాసరావు, సర్పంచ్ మెండ ఝాన్సీ అభినందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు భలే నాగరాజు, సెక్రటరీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సత్తా చాటిన మండవల్లి ఖోఖో టీం

రేపటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

కైకలూరు: ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 29, 30, 31 తేదీల్లో గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ఈఈ రామకృష్ణ శనివారం చెప్పారు. ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఏపీ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదించిన వార్షిక ఆదాయం అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయం సేకరిస్తున్నామన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: ఏపీసీపీడీసీఎల్ (విద్యుత్‌శాఖ) ఆధ్వర్యంలో విద్యుత్ ధరల నియంత్రణపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినట్లు విద్యుత్ శాఖ ఈఈ టి రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29, 30, 31 తేదీలలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కైకలూరు రూరల్ ఎస్సైగా రామకృష్ణ



కైకలూరు: రూరల్ ఎస్సైగా తలారి రామకృష్ణ శనివారం విధులలో చేరారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ఆయన నూజివీడు నుంచి కైకలూరు రూరల్ ఎస్సైగా వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై జ్యోతిబసు జంగారెడ్డిగూడెం బదిలీపై వెళ్లారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారంతో పనిచేస్తానని నూతన ఎస్సై చెప్పారు.

ఉత్తమ సేవలకు సత్కారం



ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ వేణు



పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ



ఏసీఎం తిరుపతయ్య



తహసీల్దార్ కుసుమకుమారి



వీఆర్వో రామారావు



సీఐ కిషోర్‌బాబు

గుడివాడరూరల్: మండలంలోని పశు పోషకులకు ఉత్తమ సేవలు అందించినందుకు మండల పశు వైద్యాధికారి డాక్టర్ టి.వేణుకు ఉత్తమ సేవా పురస్కారానికి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ రాజబాబు, ఎస్పీ జాషువా నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం మోటూరు పశు వైద్యశాలలో వేణును పశు పోషకులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. అదే విధంగా మండలంలోని కల్వపూడి అగ్రహారం పంచాయతీ కార్యదర్శి వి.హరికృష్ణ సచివాలయ పరిధిలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుకు సేవా పురస్కారాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీలు అందజేశారు.

పామర్రు: పామర్రు మండల ఐకేపీ ఏపీఎం సీహెచ్ తిరుపతయ్య ఉత్తమసేవలను అందించినందుకుగాను ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ నేపథ్యంలో పామర్రు మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనాల కృపావతి, సమాఖ్య సభ్యులు ఏపీఎంను అభినందించారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కలెక్టర్ రాజాబాబు, జేసీ గీతాంజలిశర్మ నుంచి తహసీల్దార్ ఎం. కుసుమకుమారి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

ఉత్తమ వీఆర్వోగా రామారావు

ఎలకుర్రు(పామర్రు): ఉత్తమ వీఆర్వోగా ఎంపికైన కానుకొల్లు కోదండ రామారావుకు కలెక్టర్ రాజాబాబు ప్రశంసాపత్రం అందజేశారు. రామారావును తోటి వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది అభినందించారు.

ఉత్తమ సీఐగా కిషోర్‌బాబు

పమిడిముక్కల: పమిడిముక్కల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.కిషోర్‌బాబును ఉత్తమ సీఐగా ఎంపిక చేసి మచిలీపట్నంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా, జేసీ గీతాంజలి శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.